# ఒకే ఠాణాలో 85 మంది బదిలీ

- పంజాగుట్ట స్టేషన్‌లో పోలీసులపై వేటు
- హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సంచలన నిర్ణయం
- ఇంతమందికి స్థానచలనం దేశంలో ఇదే మొదటిసారి
- నాడు దేశంలోనే అత్యుత్తమం.. నేడు వివాదాల నిలయం
- బదిలీ అయిన అందరినీ కార్‌కు అటాచ్ చేసిన సీపీ



హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 31 (నమస్తే తెలంగాణ): దేశంలోనే రెండో అత్యుత్తమ పోలీస్‌స్టేషన్‌గా గుర్తింపు పొందిన పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ నేడు అవినీతి, అక్రమాలు, నిర్లక్ష్యానికి అడ్డాగా మారింది. దీనిని గుర్తించిన హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి ఠాణాలోని 85 మంది సిబ్బందిని మూకుమ్మడిగా కార్ (సిటీ ఆర్మ్‌డ్ రిజర్వు ) హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేస్తూ బుధవారం సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఆ వెంటనే వేర్వేరు పోలీస్‌స్టేషన్ల నుంచి వివిధ స్థాయిల సిబ్బంది 82 మందిని పంజాగుట్ట పీఎస్‌కు బదిలీ చేశారు. పంజాగుట్ట ఠాణాలో మొత్తం 130 మంది సిబ్బంది ఉన్నారు, వీరిలో ఒకేసారి 85 మందిపై బదిలీ వేటు పడడం దేశంలోనే మొట్టమొదటి సారి అని పోలీస్ వర్గాలు చర్చించుకుంటున్నాయి. డిసెంబర్ 23న రాత్రి బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కొడుకు రహీల్ ప్రజాభవన్ వద్ద బారికేడ్లపైకి దూసుకెళ్లి ప్రమాదానికి కారకుడయ్యాడు. ఈ ఘటనను కప్పిపుచ్చుతూ ఆ ప్రమాదానికి కారకుడు రహీల్‌కు బదులుగా అతని డ్రైవర్ కారకుడంటూ అప్పటి ఇన్‌స్పెక్టర్ ఉన్నతాధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చారు. ఇన్‌స్పెక్టర్ ఉద్దేశపూర్వకంగానే రహీల్‌ను తప్పించి విదేశాలకు పారిపోవడానికి కారకుడయ్యాడని దర్యాప్తులో తేలడంతో అతడిని సస్పెండ్ చేశారు. ఈ ఘటనలో బోధన్ ఇన్‌స్పెక్టర్‌ను కూడా అరెస్ట్ చేశారు. ఈ క్రమంలోనే పంజాగుట్ట ఠాణాలో పనిచేస్తున్న సిబ్బంది విధి నిర్వాహణ, వారి వ్యవహారాలపై స్పెషల్ బ్రాంచ్ పోలీసులు అంతర్గతంగా విచారణ జరిపారు. ఇందులో సిబ్బంది అవినీతి అక్రమాలు, నిర్లక్ష్యంపై సీపీకి నివేదిక అందించారు. దీంతో హైదరాబాద్ పోలీస్ కమిషనర్ ఒకేసారి భారీ ఎత్తున్న సిబ్బందిని కార్ హెడ్ క్వార్టర్స్‌కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇది రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారగా అవినీతి అధికారుల గుండెల్లో గుబులు పుట్టించింది.

## విద్యార్థుల వీసాల జారీలో హైదరాబాద్ అగ్రస్థానం

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 31 (నమస్తే తెలంగాణ): విద్యార్థుల వీసాలను జారీ చేయడంలో హైదరాబాద్ యూఎస్ కాన్సులేట్ కార్యాలయం ప్రపంచ స్థాయిలో అగ్రస్థానంలో నిలిచింది. దేశంలోని ముంబై, న్యూఢిల్లీ, చెన్నై నగరాల్లో ఉన్న యూఎస్ కాన్సులేట్ కార్యాలయాల కంటే అధికంగా హైదరాబాద్ నుంచే విద్యార్థి వీసాల జారీ జరిగినట్టు కాన్సులేట్ అధికారులు తెలిపారు. 2023లో నిరుడు కంటే ఎక్కువ వీసాలను ప్రాసెస్ చేసిందని, సందర్శకుల వీసా అపాయింట్‌మెంట్ నిరీక్షణ సమయాన్ని 75 శాతం తగ్గిందని తెలిపారు. 2023లో దేశంలోని యూఎస్ ఎంబసీ, కాన్సులేట్ కార్యాలయాలు రికార్డు స్థాయిలో 1.4 మిలియన్ల వీసాలను జారీ చేసినట్టు పేర్కొన్నారు. యూఎస్‌లో చదువుతున్న పది లక్షల (ఒక మిలియన్) మంది విద్యార్థుల్లో నాలుగింట ఒక వంతు కంటే ఎక్కువ మంది భారతీయ విద్యార్థులే ఉండట గమనార్హం.

## ప్రాక్టికల్స్‌లో డబ్బులు డిమాండ్ చేస్తే సస్పెన్షనే!

- హెచ్చరించిన ఇంటర్‌బోర్డు
- జేఈఈ, ఎన్‌సీసీ ఏ,బీ సర్టిఫికెట్ పరీక్షలు రాయనున్న పలువురు విద్యార్థులు
- వీరికి మరో షిఫ్ట్‌లో రాసుకొనే వెసులుబాటు

హైదరాబాద్, జనవరి 31 (నమస్తే తెలంగాణ) : ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షల్లో మార్కులేసేందుకు ఎగ్జామినర్లు డబ్బులు డిమాండ్ చేసినట్టుగా తేలినా..వసూళ్లకు పాల్పడినా సస్పెండ్ చేస్తామని ఇంటర్‌బోర్డు పరీక్షల నియంత్రణాధికారి (సీవోఈ) జయప్రదబాయి హెచ్చరించారు. నిరుడు ఇద్దరు లెక్చరర్లను సస్పెండ్ చేశామని, ఈ ఏడాది కూడా ఇదే తరహాలో కఠిన చర్యలుంటాయని తెలిపారు. గురువారం నుంచి ప్రాక్టికల్స్ ప్రారంభంకానున్న నేపథ్యంలో బుధవారం నాంపల్లిలోని ఇంటర్‌బోర్డు కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. పరీక్షల్లో మార్కులేసేందుకు డబ్బులు డిమాండ్ చేస్తే తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు. పరీక్షల నిర్వహణకు అన్ని రకాల ఏర్పాట్లు చేశామని ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా నియమితులైన వారిని రిలీవ్ చేయని కాలేజీకు జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. డిజిటల్ ప్రశ్నపత్రాలను ఎగ్జామినర్లకు పంపిసామని, ఓటీపీ ద్వారా ఆయా పేపర్‌ను ఓపెన్ చేయాలని సూచించారు.

### వీరు 15లోపు ప్రాక్టికల్స్ రాయొచ్చు

ఇంటర్ ప్రాక్టికల్స్ సమయంలోనే జేఈఈ మెయిన్, ఎన్‌సీసీ ఏ, బీ సర్టిఫికెట్ పరీక్షలు జరుగనున్నాయి. గురువారం జేఈఈ మెయిన్ -1 ఎగ్జామ్ జరుగనుండగా, 4న ఎన్‌సీసీ -ఏ సర్టిఫికెట్, 11న ఎన్‌సీసీ - బీ సర్టిఫికెట్ పరీక్షలున్నాయి. ఇంటర్ విద్యార్థుల్లో కొందరు ఈ పరీక్షలకు హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయా పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఈ నెల 15లోపు ఎప్పుడైనా ప్రాక్టికల్స్‌కు హాజరు కావొచ్చని తెలిపారు. ఇందుకు ఇంటర్ బోర్డు, డీఐఈవో కార్యాలయం అనుమతి పొందాలని జయప్రదబాయి చెప్పారు.

## పోలీస్ ఉద్యోగం రాలేదని ఆత్మహత్య



శ్రీకాంత్ (ఫైల్)

ఆత్మకూరు, జనవరి 31: పోలీస్ ఉద్యోగం రాలేదని మనస్తాపంతో ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. 17 రోజులపాటు చికిత్స పొంది బుధవారం మృతిచెందాడు. ఈ ఘటన హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం నీరుకుళ్ల గ్రామంలో చోటుచేసుకున్నది. ఎస్సై ప్రసాద్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొత్తపల్లి శ్రీకాంత్ (29) గతేడాది హైదరాబాద్‌లోని ఎస్సార్ నగర్‌లో కానిస్టేబుల్ కోచింగ్ తీసుకొని పరీక్షలు రాశాడు. అక్టోబర్ 2023లో ఫలితాల్లో ఎంపిక కాలేదు. ఉద్యోగానికి వయోపరిమితి దాటిపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. జనవరి 14న పురుగుల మందు తాగాడు. శ్రీకాంత్ ఎంజీఎం దవాఖానలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందా డు. పోలీసులు కేసు నమోదు చేసుకొన్నారు.

## ఖని పీజీ కాలేజీ ప్రిన్సిపాల్‌కు పేటెంట్ హక్కులు



ఎస్ రమాకాంత్

ఫర్టిలైజర్‌సిటీ, జనవరి 31: గోదావరిఖని పీజీ కళాశాల భౌతికశాస్త్ర అధ్యాపకుడు, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ రమాకాంత్ చేసిన పరిశోధనకు పేటెంట్ హక్కులు వచ్చాయి. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లోని ఫిజిక్స్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ ఏసీ జేమ్స్ రాజు పర్యవేక్షణలో డిపార్టుమెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, సైన్స్ అండ్ ఇంజినీరింగ్ రీసెర్చ్ బోర్డు సహకారంతో ట్యూనబుల్ మైక్రోవేవ్ పరికరాల కోసం 300 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద ఫెర్రో ఎలక్ట్రిక్ థిన్ ఫిల్మ్‌ను స్పటికీకరించడానికి లేజర్ ఆధారిత పద్ధతిపై చేసిన పరిశోధనకు పేటెంట్ వచ్చినట్టు రమాకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా రమాకాంత్‌ను పలువురు అధ్యాపకులు అభినందించారు.



రికార్డు నెలకొల్పే సమయంలో లాయర్ ఎస్‌కే అష్రఫ్

## 2.69 సెకన్లలో కంప్యూటర్ కీబోర్డు టైపింగ్

### ప్రపంచ రికార్డు నెలకొల్పిన లాయర్ అష్రఫ్

చార్మినార్, జనవరి 31: కంప్యూటర్ కీబోర్డు టైపింగ్‌లో హైదరాబాద్ న్యాయవాది ఎస్‌కే అష్రఫ్ ప్రపంచ రికార్డును నెలకొల్పారు. హైకోర్టు న్యాయవాదుల సమక్షంలో ఆయన కీబోర్డుపై ఉన్న అక్షరాలను కేవలం 2.69 సెకన్లలో టైప్ చేయడంతో ఇప్పటివరకు ఉన్న 3.70 సెకన్ల రికార్డు చెరిగిపోయింది. అష్రఫ్ ఫీట్‌ను గిన్నిస్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ నిర్వాహకులు గుర్తించారు. దీంతో హైకోర్టు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వీ రఘునందన్, స్పోర్ట్ అండ్ కల్చరల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ కార్యదదర్శి శారద కటకం, ఉపాధ్యక్షుడు కల్యాణరావు, కార్యదర్శి కట్టా ప్రదీప్‌కుమార్, ట్రెజరర్ వీ పూర్ణశ్రీ సీనియర్ సభ్యులు శ్రీనివాస్‌రావు కల్లకూరి, ఎం శ్రీనివాస్‌రావు తదితరులు అష్రఫ్‌ను అభినందించారు. ఈ సందర్భంగా అష్రఫ్ మాట్లాడుతూ.. మున్ముందు మరికొన్ని రికార్డులు నెలకొల్పేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు.

## సర్కారు జూనియర్ కాలేజీల్లో యోగా టీచర్లు

- 'విద్యాంజలి'లో పథకంలో భాగంగా నియామకాలు
- స్వీపర్లు, పారిశుద్ధ్య కార్మికులనూ సమకూర్చనున్న కాస్ సంస్థ

హైదరాబాద్, జనవరి 31 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని సర్కారు జూనియర్ కాలేజీల్లో సరికొత్త ప్రయోగానికి అధికారులు శ్రీకారం చుట్టబోతున్నారు. విద్యార్థుల్లోని ఒత్తిడిని దూరం చేసేందుకు యోగా టీచర్ల సేవలను వినియోగించుకోవాలని భావిస్తున్నారు. వీలైనంత త్వరగా ఇందుకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వనున్నారు. విద్యాంజలి పథకంలో భాగంగా కాస్ ఫౌండేషన్ సంస్థ యోగా టీచర్లను నియమిస్తామని ముందుకొచ్చింది. ఇందుకు అనుమతినివ్వాలని కోరుతూ సంస్థ వర్గాలు ఇటీవలే ఇంటర్‌విద్య కమిషనరేట్ అధికారులను సంప్రదించారు. యోగా టీచర్లే కాకుండా స్వీపర్లు, పారిశుద్ధ్య కార్మికులను కూడా తాము సమకూర్చుతామని సంస్థ వర్గాలు.. అధికారుల దృష్టికి తీసుకొచ్చాయి. ఇదే విషయాన్ని అధికారులు ప్రభుత్వ పరిశీలనకు పంపించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 420 ప్రభుత్వ జూనియర్ కాలేజీలున్నాయి. వీటిల్లో సుమారుగా 1.63 లక్షల మంది విద్యార్థులున్నారు.

## ఏజీగా మాధవి బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, జనవరి 31 (నమస్తే తెలంగాణ): తెలంగాణ అకౌంటెంట్ జనరల్ (ఆడిట్)గా సీనియర్ అధికారి పీ మాధవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె 2001లో ఇండియన్ ఆడిట్ అండ్ అకౌంట్స్ సర్వీసెస్‌లో చేరారు. గతంలో మహారాష్ట్రలో అకౌంటెంట్ జనరల్ (ఆడిట్-111)గా, చెన్నైలోని రీజనల్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రిన్సిపల్ డైరెక్టర్‌గా, అక్కడే ప్రిన్సిపల్ డైరెక్టర్ ఆడిట్ (సెంట్రల్)గా పనిచేశారు. అంతకుముందు కొలంబో, పోర్ట్ లూయిస్, అంటనానరివోలలో ఎంబసీ ఆడిట్‌లో, జెనీవాలోని ప్రపంచ ఆరోగ్య సంస్థలో ఫైనాన్సియల్ ఆడిట్‌లో, యూనిసెఫ్ ఆడిట్‌లో, న్యూయార్క్‌లోని యూఎస్ మిషన్ ఫర్ ఎబోలా ఎమర్జెన్సీ రెస్పాన్స్ (ఈఎన్ఎంఈఈఆర్) ఆడిట్‌లో పాలుపంచుకున్నారు. సాయ్ ఇండియా, సాయ్ కువైట్ సంయుక్త సెమినార్‌లోనూ పాల్గొన్నారు.

## అన్‌రిజర్వ్‌డ్ టికెట్లపై 3శాతం బోనస్

- ఏటీవీఎం ద్వారా తీసుకున్న టికెట్లపై ఆఫర్
- దక్షిణ మధ్య రైల్వే అధికారుల వెల్లడి
- యూటీఎస్ ఆర్-వాలెట్‌లో అమలు

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 31 (నమస్తే తెలంగాణ): ఆటోమెటిక్ టికెట్ వెండింగ్ మిషన్ ద్వారా అన్‌రిజర్వ్‌డ్ టికెట్లు పొందిన వారికి 3శాతం బోనస్ ప్రకటిస్తూ బుధవారం దక్షిణ మధ్య రైల్వే జోన్ నిర్ణయం తీసుకున్నట్టు అధికారులు ప్రకటించారు. ఇప్పటికే యూటీఎస్ మొబైల్ యాప్, ఆర్‌వాలెట్ ద్వారా టికెట్లు పొందుతున్న వారికి బోనస్ ఇస్తున్నది. ప్రజాదరణకు అనుగుణంగా ఏటీవీఎం మిషన్ ద్వారా టికెట్ పొందిన వారికి కూడా ఈ అవకాశం కల్పిస్తే ఎక్కువమంది ప్రయాణికులు సద్వినియోగం చేసుకుంటారనే అభిప్రాయం వ్యక్తం కాగా, ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే జోన్ ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. యూటీఎస్-ఆర్‌వాలెట్ ద్వారా కూడా టికెట్లు పొందే అవకాశం తీసుకొచ్చినట్టు రైల్వే అధికారులు తెలిపారు.

## ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి పదవీ విరమణ

హైదరాబాద్, జనవరి 31 (నమస్తే తెలంగాణ): ప్రముఖ విద్యావేత్త బీఆర్‌ఏవోయూ అకడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి బుధవారం పదవీ విరమణ పొందారు. సీనియర్ ప్రొఫెసర్ హోదాలో విరమణ పొందిన ఆయనకు సహచరులు, ఆచార్యులు, వర్సిటీ సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. 1994లో బీఆర్‌ఏఓయూ సోషియాలజీ విభాగంలో సహాయ ఆచార్యుడిగా ఉద్యోగంలో చేరి, అంచెలంచెలుగా ఎదిగారు. 1997 నుంచి 2014 వరకు తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో భాగమయ్యారు.

## విద్యా - ఉద్యోగ సమాచారం

### 010 పద్దు ద్వారా వేతనాలివ్వాలి : పీఆర్‌జీటీఏ

హైదరాబాద్, జనవరి 31 (నమస్తే తెలంగాణ) : బీసీ గురుకుల టీచర్లకు 010 పద్దు ద్వారా వేతనాలివ్వాలని, అన్ని రకాల సమస్యలను పరిష్కరించాలని పీఆర్టీయూ అనుబంధ సంఘంప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ అసోసియేషన్ (పీఆర్‌జీటీఏ) మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరింది. అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంత్రి బుధవారం ఆవిష్కరించారు. బీసీ గురుకులాల పనివేళలను మార్చాలని, జీవో-317 సమస్యలను పరిష్కరించి, పదోన్నతులు కల్పించాలని, టీఎస్ జీఎల్ఐ అమలుచేయాలని, రెండో శనివారం సెలవులివ్వాలని అసోసియేషన్ నేతలు మంత్రిని కోరారు. సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి హామీనిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీపాల్‌రెడ్డి, కమలాకర్‌రావు మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

### ఉన్నత విద్యామండలి కార్యదర్శిగా శ్రీరాం వెంకటేశ్?

హైదరాబాద్, జనవరి 31 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఉన్నత విద్యామండలి కార్యదర్శిగా ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్ నియమితులు కానున్నారు. ఆయనను ఇన్‌చార్జి సెక్రటరీగా నియమించేందుకు విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ అనుమతి కోరారు. శ్రీరాం వెంకటేశ్ ప్రస్తుతం ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా కొనసాగుతున్నారు. ఇంతకాలం సెక్రటరీగా పనిచేసిన డాక్టర్ శ్రీనివాస్‌రావుకు ఉన్నత విద్యామండలి అధికారులు బుధవారం ఘనంగా వీడ్కోలు పలికారు.

### జేఈఈ గణితం కఠినం!

హైదరాబాద్, జనవరి31 (నమస్తే తెలంగాణ): జేఈఈ పేపర్-1 గణితం ప్రశ్నపత్రం కఠినంగా వచ్చింది. బుధవారం పరీక్ష జరగ్గా, విద్యార్థులు సమాధానాలు రాసేందుకు ఇబ్బందులు పడ్డారు. ఇప్పటివరకు జరిగిన పేపర్-1 పరీక్షల్లోకెల్లా గణితం ప్రశ్నలు చాలా కఠినంగా వచ్చినట్టు విద్యా నిపుణులు తెలిపారు.


